# నిమ్మళం ప్రాణి

కె. పట్టాభి రామయ్య



తూరుపుకొండపై సూర్యదేవుడు వెలిశాడు.

ఆ లోకరక్షకుని కరుణాదృష్టిలో సకల ప్రాణులు నిద్రమత్తును వదిలి కళ్లు తెరిచాయి.

ఉదయ ఘడియలలో ప్రకృతి అంతా పదును బాకులా మెరిసిపోతూంది.

"పదునుబాకు ఎవరి గుండెల్లో గుచ్చుదామా" అని ఆలోచిస్తున్నారు స్వార్థపరులు.

"తమ నెత్తురు ఏ ఉన్నవానికి ధార పోద్దామా" అని వెతుక్కుంటున్నారు పేదజీవులు.

"ఏ ఉపద్రవమూ లేకుండా రోజు గడవనీ, తండ్రీ!" అని లోకబాంధవునికి అంజలిస్తున్నారు భక్తిపరులు.

కళ్లు తెరిచిన ప్రతి ప్రాణి తన జానెడు పొట్ట కోసం అనేక విధాలుగా వేటను ప్రారంభించింది.

పోటు విడిచి అప్పుడే పాటుకు తిరుగబడింది సముద్రం.

**ఉన్నంత వరకూ ఊడ్చుకుతిని, శక్తి ఉన్నంత కాలంచాకిరీ చేయించుకుని, రెక్కలు రాగానే తనదీ అనుకొనే ఓ గూటికి ఎగిరిపోవడం జీర్ణించిన స్వార్థానికి చిహ్నమే కాని, వ్యక్తిత్వానికి గుర్తు కాదు. బ్రతికి ఉండగా అయిన వాళ్లు పీక్కు తింటే, చచ్చాక గద్దలు పీక్కు తింటాయి. అనాథల బ్రతుకు లన్నీ విషాదాంతాలే . . .**

పోటుపాటుల నడుమనున్న గౌతమీ జలాలు వడివి విడిచి చిరుగాలికి కదలాడుతున్నాయి. ఆ ఏటిపై రబ్బరు బుడగలా ఉబ్బి తేలుతూం దో శవం.

"శిథిలమైన వస్త్రాన్ని విడిచి నూతన వస్త్రాన్ని ధరించటం లాంటిది" అని మరణానికి ఉపమానం చెప్పాడు శ్రీకృష్ణ పరమాత్మ.

నూతన వస్త్రాలను ధరించటానికి అందరూ ఇష్టపడతారు. మరి మరణమంటే కష్టపడతారు. ఏది ఏమైనా అక్కడక్కడ తమ తనువుల్ని బలవంతంగా విడిచిన దౌర్భాగ్యపు జీవులుకూడా ఉన్నారు. అలాటి నిర్భాగ్యపుప్రాణిదే ఆ ఏటిలో తేలుతున్న శవం. బలవంతంగా విడిచిన తన తనువును వదిలి దూరంగా పోలేక ఏటిఒడ్డునే ఉన్న జువ్విచెట్టు మీద నుండి తేలుతున్న తన దేహం కేసి జాలిగా చూస్తూంది ఆ జీవి.

అల్లంత దూరంలో చిన్న నావపై నుండి చేపల్ని పడుతున్నాడు ఒక జాలరి. ఆకాశంలో చక్రాలు చుట్టుతూ ఆహారం కోసం తడుముకుంటున్నాయి రాబందులు.

తేలుతున్న శవాన్ని నావలో నున్న జాలరి చూశాడు. నింగిపై ఎగురుతున్న రాబందులుకూడా చూశాయి.

చూచిన కళ్ళు మెరిశాయి.

"చెవినో,ముక్కునో గోరెడు బంగారం లేకపోతుందా" అనే ఆశతో నావను ఆటుకేసి తిప్పాడు జాలరి.

"ఏ దిబ్బకన్నా చేరకపోతుందా! కండలు పీక్కుని క్షుద్బాధ తీర్చుకుందా" మని గుటకలు వేస్తూ క్రింది వాలు పట్టాయి రాబందులు.

"బంధువులమధ్య అగ్నిదేవుని ఒడిలో బూడిద కావలసిన తన శరీరం ఏటిపాలై చేపలకు, పక్షులకు ఆహారం కావలసి వచ్చింది. ఏనాడు చేసుకున్న పాపమో!" అని ఆవేదనతో అల్లాడిపోయిం దా జీవి. ఆ క్షణంలో తన గత జీవితం స్మృతికి వచ్చింది.



ఆ ప్రాణి ఒక పేద కుటుంబంలో పెద్దబిడ్డగా జన్మించింది. తల్లిదండ్రులు ఆ బిడ్డకు తమ గ్రామదేవత పేరు 'ముత్యాలమ్మ' అని పెట్టుకున్నారు. ఆ పిల్ల నల్లగా ఉండటంచే 'నల్లమ్మ' అని ముద్దుగా పిలిచేవారు. దానితో పెట్టిన పేరు మరుగై ముద్దుపేరే స్థిరమై పోయింది. నల్లమ్మ తరవాత ఓ మగబిడ్డ, మరో ఆడబిడ్డ పుట్టారు.

నల్లమ్మకు పెళ్లికాక మునుపే తండ్రి మరణించాడు.

నదికి ఆవల ఇరవై మైళ్ల దూరంలో ఉన్న రెండవ పెళ్లివానితో నల్లమ్మ పెండ్లి జరిగింది. అతని మొదటి భార్య కో మగబిడ్డ ఉన్నాడు. గట్టి ఇల్లు, ఓ ఎకరం భూమి ఉన్నాయి. పాడిపశువులుకూడా ఉన్నాయి. సవతిబిడ్డను ఎంతో ప్రేమగా చూసుకునేది నల్లమ్మ. నల్లమ్మ కడుపు మాత్రం పండలేదు.

కష్టపడేవాళ్లకు పెనక ఓ ఎకరం నేల ఉంటే వారికి మించిన అదృష్టవంతులే ఉండరు. చేలో పంట తిండికి సరిపోతుంది. చేసుకున్న కూలి పై ఖర్చులకు పోగా నిలవచేసి నల్లమ్మకు నాలుగు నగలు చేయించాడు భర్త. ఏ ఒడుదుడుకులు లేకుండా వారి సంసారం హాయిగా సాగిపోయేది.

అమ్మగారి ఇల్లు దూరమవటంచే భర్తతో కలిసి కుర్రవాణ్ణి తీసుకుని ఏడాది కో సారి వచ్చేది నల్లమ్మ. వారి ప్రాంతంలో అన్నీ పండుతాయి. అందుచే పుట్టినింటికి వచ్చేటప్పుడు బెల్లమూ, మిరపకాయలూ, జొన్నలూ, పెసలూ, మినుములూ-ఇలాంటివి ఎన్నో తెచ్చేవారు. తల్లి, తమ్ముడు, చెల్లెలు ఎంతో ఆదరంగా చూచేవారు. వెళ్లేటప్పుడు కూతురికి, అల్లుడికి, పిల్లవాడికి కొత్త బట్టలు తప్పకుండా పెట్టి సాగనంపేది నల్లమ్మ తల్లి.

తమ్ముడికీ, చెల్లెలికి దగ్గరలోనే సంబంధాలు కుదిరాయి. వారి పెళ్లిళ్లకు ఘనంగానే కానుకలు ఇచ్చారు నల్లమ్మ దంపతులు. తగిన రీతిగానే సత్కరించి పంపారు తల్లీ, తమ్ముడూ నల్లమ్మని.

కొన్నాళ్లకు నల్లమ్మతల్లి చనిపోయింది. పెద్దకార్యానికి కాస్త ఎక్కువగానే సహాయం చేసింది నల్లమ్మ.

నల్లమ్మ తిరిగి వెళ్లేటప్పుడు కంట తడి పెట్టుకుంది. ఆమెతో పాటు తమ్ముడూ, చెల్లెలూకూడా కళ్లనీరు కార్చారు.

"అమ్మా, అయ్యా లేరని మమ్మల్ని మరిచిపోకు. మామూలుగానే వస్తూ పోతుండండి!" అన్నాడు తమ్ముడు.

"అలాగే వస్తాంలేరా! చెల్లెలు దగ్గరలో ఉంది. అప్పుడప్పుడు వెళ్లి దాన్ని చూస్తూండు" అని చెప్పి ముందుకి సాగిపోయారు.

నల్లమ్మ సవతికొడుకుకు పెండ్లి అయింది. కోడలు కాపురానికి వచ్చింది. ఆమె కాస్త గయ్యాళి అనే చెప్పాలి.

వయసు పెరిగిన నల్లమ్మ భర్త కాలం చేశాడు. కోడలి తీరును కనిపెట్టిన నల్లమ్మ భర్త తను పోయిన తరవాత తన కుటుంబం ఏ స్థితి పాలవుతుందో అని దూరాలోచన చేసి ఆస్తిని కొడుక్కి, భార్యకి సమానంగా వ్రాయించాడు. పాడిగేదెల్ని చెరొకటి తీసుకోమన్నాడు.

భర్త ఉన్నంత కాలమూ నల్లమ్మ జీవితం మూడు పువ్వులు పూసి ఆరు కాయలు కాచింది. భర్త చనిపోవటంతో ఆమె బ్రతుకు మలుపు తిరిగి గతుకుల్లో పడింది.

నలుగురి నోళ్లలోను నలిగినవాడవటంచే నల్లమ్మ భర్త దినకార్యం అందరూ బాగనేలా జరిపించారు.

తమ్ముడు వచ్చి భర్త పోయిన నల్లమ్మను తొలిసారి పుట్టినింటికి తీసుకువచ్చాడు. చెల్లెలుకూడా అక్కడికి వచ్చింది.

ఆ రాత్రి ముగ్గురూ ఓ చోట కూర్చున్నారు.

ఆ మాటా ఈ మాటా చెప్పి, "నువ్వొక్కదానివే అక్కడెందుకు? నీ వాటా అమ్మి ఇక్కడికి రావే— మా తోనే ఉందువుగాని" అని తమ

అభిప్రాయాన్ని వెలిబుచ్చారు తమ్ముడూ, చెల్లెలూ.

నల్లమ్మ ఏమీ మాట్లాడలేదు. పరాకుగా ఉండిపోయింది.


"పెంచేవని నీ సవతికొడుక్కి పట్టేఉన్నా, వచ్చింది నిన్ను చూడనిస్తా 'దేంటి?" మళ్లీ అదే మాట రెట్టించాడు తమ్ముడు.

"అక్కడ నీకు కష్టమొచ్చినా, సుఖమొచ్చినా చూచేవా ళ్లెవరున్నారు? దగ్గరలో ఉంటే ఒకరి కష్టసుఖా లొకరు చూచుకోవచ్చును. కాబట్టి చల్లగా నీ వాటా ఇల్లూ, భూమీ బేరం పెట్టు' అని వంతు పలికింది. చెల్లెలు.

పేలవంగా నవ్వుకుంది నల్లమ్మ అంత కష్టంలోనూ.

"కన్నబిడ్డలాగే వాణ్ణి పెంచాను. వాడు నన్ను చూచినా, చూడకపోయినా నేను మాత్రం వాణ్ణి చూడకపోతే ఉండలేను" అని తన నిర్ణయాన్ని తెలిపింది నల్లమ్మ.

ఆ మాటలకు వా రిరువురూ ఎరను మింగిన పాములైనారు.



గుత్తులు గుత్తులు

ఫోటో—వి. కృష్ణారావు (నెల్లూరు)

ఓ వారం రోజులున్న తరవాత నల్లమ్మ తన ఇంటికి వెళ్లిపోయింది.

కొడుకూ, తల్లీ ఎవరి కుండ వాళ్ళు వార్చుకుంటున్నారు.

నల్లమ్మ తనకు వచ్చిన గేదెను మేపుకుంటూ, పని చేసుకుంటూ ఒకరిని చేయి చాచకుండా గడుపుతూంది.

ఆ సంవత్సరంలోనే నల్లమ్మ చెల్లెలు తన కొడుకును తీసుకుని అక్కగారి ఇంటికి వచ్చింది. అప్పటికి గేదె పాలు ఇస్తూంది. చెల్లెలికి, చెల్లెలి కొడుక్కి పాలు, మజ్జిగ మొగం మొత్తేలా పెట్టింది.

చెల్లెలి కళ్లు గేదెమీద పడ్డాయి.

"ఏమోలప్పా! నువ్వు పనికీ పాటకీ పోతుంటావు. నీకు తోడు ఈ గేదె ఎందుకు? చంటోడు మజ్జిగంటే చెవి కోసుకుంటాడు. దీన్ని నాకు తోలిపెట్టెయ్యి. నీ ఋణం ఉంచుకోంలే" అంటూ అక్క ముందు గారం గుడిచింది చెల్లెలు.

పనికి వెళ్లిన రోజున గేదెను చూసుకోవటం కాస్త బాధగానే ఉంది నల్లమ్మకు. అందుచే గేదెను చెల్లెలికి తోలిపెడితేనే బాగుంటుందేమో అని తోచిం దామెకు.

"తీసుకుపోవే" అంది నల్లమ్మ.

అక్క మెత్తబడిందని గ్రహించింది చెల్లెలు. "ఊరకనే తోలిపెట్టవద్దులేవే! నీకు అవసరమొచ్చినప్పుడు కొద్దో గొప్పో ఖరీదు కట్టి సొమ్ము పుచ్చుకుందువుగాని" అంది ఉత్సాహంగా.

ఎలాగైతేనేం అక్కను బులిపించి గేదెను తోలించుకుపోయింది చెల్లెలు.

అది తెలిసిన తమ్ముడు అక్కగారి మీద కష్టం పెట్టుకున్నాడు.

సవతికొడుకు, కోడలు రుసరుసలాడటం ప్రారంభించారు.

ఓనాడు తల్లీ కొడుకుల మధ్య మాటా మాటా వచ్చింది.

"ఈవేళ గేదెను తోలి పెట్టావు. రేపు భూమీ, ఇల్లూ అమ్మి పెడతావు. కాలూ చేయీ వంగిన తరవాత ఎవడు చూస్తాడనుకున్నావు" అని తల్లికి ఎదురు తిరిగాడు పెంచిన బిడ్డ.

"ఇప్పు డున్నదంతా పుట్టింటోళ్లకి దోచిపెడతావు. అవక లేనప్పుడు మన నెత్తి కెక్కుతాది." అత్తగారిని ఆడిపోసింది కోడలు.

వారి మాటలకు నల్లమ్మ మనసు చివుక్కుమంది.

"నేను గడించిన భూమీ నేను నా వాళ్లకి దోచి పెట్టడం లేదు. గేదెను ధర్మానికి తోలిపెట్టలేదు. నువ్వు కోరినట్లు నా కా గతి పడితే ముద్ద కోసం కుక్కలా నీ గుమ్మంలో పడి ఉండనులే, అమ్మా!" నిష్ఠురంగా మాట్లాడింది నల్లమ్మ.

కాలం పెరుగుతూంది. నల్లమ్మ ఆయువు తరుగుతూంది.

నల్లమ్మ మళ్లీ ఓసారి అమ్మగారి ఊరు వచ్చింది. ముందుగా తమ్ముడి ఇంటికే వెళ్లింది. మునపటిలా మూటలతో రాలేదు. అది చూచిన తమ్ముడు ఎడమొగం పెట్టాడు. అయినా దొరక్కుండా మంచి చెడ్డ లడిగాడు. అక్కగారికి మచ్చిక చేసి ఎలా అయినా కొద్దో గొప్పో సొమ్ము చేతబట్టాలని చూశాడు.

"ఏదైనా వర్తకం చేసుకుందామనుకుంటున్నాను. వందో, రెండొందలో సర్దుబాటుచేయవే" అని అడిగాడు.

"నా దగ్గర మాత్రం నిలవేముందిరా! ఇన్నాళ్లలా నేను సరిగా పని చేయలేకపోతున్నాను. ఇక చేలో వచ్చే ఆదాయం మాత్ర మెంత? నా పొట్టకి గటాగటీగా సరిపోతుంది" అంది.

"నా కెందుకు ఇస్తావులే! చెల్లెలుకు కాబట్టి గేదెను తోలిపెట్టావు" అని ముక్కున మూలిగాడు.

"ఉన్నప్పుడు నిన్ను మాత్రం చూడలేదంట్రా? వచ్చినప్పుడల్లా పదీ పరకా ఇచ్చాను" అని తమ్ముణ్ణి మందలించింది.

లోలోపల [illegible] గక్కాడు తమ్ముడు.

తమ్ము డింట [illegible] లుండి చెల్లెలింటికి బయలుదేరింది నల్లమ్మ. వెళ్లేటప్పుడు తమ్ముడి కో అయిదు రూపాయలు ఇచ్చింది.

అక్క వాటా అమ్మించి ఆమెను తన ఇంటికి రప్పించుకోవాలనే చెల్లెలి తాపత్రయం. మళ్లీ అదే మాట అక్క ముందు వెల్లడి చేసింది. "అక్కడ ఒంటిగా ఏముంటావు? ఉన్నది అమ్ముకుని ఇక్కడికి రావే. మాతోపాటే ఉందువుగాని" అంది.

"ఎప్పుడు చూచినా వాడూ, నువ్వూ ఉన్న దమ్ముకోమనే గొడవే గాని మరే గొడవ లేదు. ఉంది కాబట్టే అలా పాకులాడుతున్నారు. లేకపోతే ఏం చేద్దురో!" చనువుకొద్దీ కసురుకుంది చెల్లెల్ని.

"అయితే నీ ఇష్టమొచ్చినట్లే చేసుకోవే." అక్కమీద రుసరుసలాడింది.

చెల్లెలి ఇంటవద్ద మరో రెండు రోజు లుండి తన ఇంటికి వెళ్లిపోయింది నల్లమ్మ. ఉన్న రెండు రోజులైనా తమ్ముడుగాని, చెల్లెలుగాని సరి అయిన ఆదరణ చూపలేదు.

నల్లమ్మ బాగా వంగిపోయింది. పనికి వెళ్లలేకపోతూంది. పనికి వెళ్లకపోయినా ఇదివరకు తిన్న రుచులు మానలేకపోయింది. అందుచే దొరికిన చోటల్లా అప్పు తెచ్చి తినివేస్తూంది.

అది చూచి సవతికొడుక్కి ఆలోచన పట్టుకుంది. 'ఇలా కొన్నాళ్లుంటే ఇల్లుకూడా అమ్మకు తినేస్తుంది. అమ్మ నెలాగైనా మంచి చేసుకుని ఇల్లు దక్కించుకోవాలనే ఎత్తు వేశాడు. ఆ యోచన తట్టినప్పట్నుంచి అప్పుడప్పుడు మంచి కూర ఉన్నపూట ఆమెను పిలిచి భోజనం పెట్టించేవాడు. "అమ్మా! అమ్మా!" అంటూ చనువుగా మసిలేవాడు.

అలా ఉంటూ ఓ నాడు—"అమ్మా! ఈ వయసులో నువ్వొక్కదానివి వేరే వండుకోట మెందుకు? నీకు కావలసింది గుప్పెడన్నం. మాతోపాటే తిందువుగాని. భూమి అమ్మి ఇంతవరకు నువ్వు చేసిన అప్పులు తీర్చివేద్దాం. నీ వాటా ఇల్లు కూడా నా పేరను వ్రాయి" అని తీపి మాటలతో తల్లిని ఊరించాడు.

అమాయకురాలైన నల్లమ్మ పొంగిపోయింది. కడుపుపంటకు నోచుకోలేని ఆ తల్లి హృదయంలో పెంచిన బిడ్డ

చూపించిన ఆదరం అమృతాన్ని చిందించింది.

'కడుపార కనకపోయినా వాణ్ణి చేతులార పెంచాను. వాడికా మాత్రం విశ్వాసం ఉండకపోదు. ఈ వయసులో ఇక నన్నాదుకునేవారు మాత్ర మెవరున్నారు? నేను చచ్చినప్పుడు తలకాడ కొరివైనా పెడతాడు' అని మనసులో అనుకుంది.

"అలాగే, బాబూ! నీ ఇష్టప్రకారమే చేద్దాం" అంది కొడుకుతో.

నెల తిరిగేసరికి తన వాటా భూమి అమ్మివేయటం, ఇల్లు కొడుకు పేరను వ్రాయించటం జరిగిపోయాయి. అప్పులు తీర్చగా మిగిలింది కొడుకుకే ఇచ్చివేసింది నల్లమ్మ.

కొన్ని నెలపాటు కొడుకూ, కోడలూ నల్లమ్మను ప్రేమగానే చూశారు. ఆ పైన చిరబారలాడటం ప్రారంభించారు.

"పాటుతేని ఇంటికి చేటు అన్నట్టు ఈ కొంపలో పాటాడే వాళ్ళు తక్కువ. మింగేవాళ్ళు ఎక్కువ. ఏ పిల్లకాలముండ ముక్కార్చంటే ఎవడు పోషిస్తాడు" అంటూ కోడలు సాధింపులు మొదలుపెట్టింది.

మొదట్లో నల్లమ్మ విపీ విననట్లు ఊరుకుంది. ఇక ఉండబట్టలేక ఓ నాడు మాట తిరుగవేసింది. "నువ్వనేది నన్ను గురించే కదా? ఎవరి సొమ్మూ నాకు పెట్టడం లేదు. నాది నాకు పెడుతున్నారు" అంది.

"కూటికి చేటులు, కాటికి కాళ్ళు చాచుకుని ఉన్నా ఉక్రోషం పెద్దదే" అంది కోడలు.

"కూటికి చూడకుండా, కాటికి పోకుండా నువ్వు ఒట్టే కట్టుకుని ఉందువుగాన్లే" అంది అత్తగారు.

అంతలో కొడుకు వచ్చి విషయాన్ని తెలుసుకున్నాడు. పెళ్ళాం మాటలు విని అగ్గిలేచి కళ్ళెర్ర జేశాడు. "నీ ఇచ్చిన ఆస్తికి ఇన్నాళ్ళు తిన్నది చాలు. ఇక నా ఇంట్లో ఒక్క క్షణంకూడా ఉండటానికి వీల్లేదు. ఎక్కడికి పోతావో పో" అన్నాడు.

ఆ మాటలకు అదిరిపడింది నల్లమ్మ. "ఏదో చేస్తావని నమ్మి ఉన్నదంతా నీ చేతిలో పెట్టాను. కడకు నువ్వు చేసే పరువు ఇదట్రా?" ఆమెకు దిక్కు తోచని దుఃఖం పొంగి వచ్చింది.

"బుడిబుడి దుఃఖాలు చాల్లే అమ్మా!" ఎగతాళి చేసింది కోడలు.

"చచ్చిందాకా నిన్ను పోషించాలని ఇక్కడేమీ రాసి పెట్టలేదు. నా కిష్టమైతే ఓ ముద్ద పెడతాను. లేకపోతే లేదు. అయినా, అయిదు వందలు ఖరీదైన గేదెను చెల్లెలికి తోలిపెట్టావు కదూ? ఇప్పుడు చూడ


అనన్య సామాన్య ప్రచారంగల తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

అంతస్సులూ - (సంయుక్) అంతఃకరణాలూ .. 5.00
మారనికాలం - మారనిమనుషులు 4.00
జీవని .... 4.00
స్వీకారం .... 3.50
కౌగిటంపురాలు .... 3.00
జ్ఞాననేత్రం .... 2.50
నాసైరేలాఅక పేజీ 1.50
రేపటిదుబ్బు 5.00
గంగూలిప్రేమకథ .. 4.00

పెళ్ళిఎవరికి ..... 5.00
తీయనిశాపం .... 5.00
అనిర్వచనీయం 4.00
కల్పన .... 4.00
చక్రభ్రమణం ... 5.00
రూ5.00లకు మించి కొనువారు ముందుగా డబ్బుM.O ద్వారా పంపిన పోస్టేజీ ఉచితం
వి.పి. పద్ధతిలేదు

ఈ పొద్దికకోరికలు 5.00
హృదయకుసుమాలు 5.00
సరిపడి మనసులు... 6.00
లోకంపోకడ .... 5.00
మనసులుమారాయి
గగనకుసుమాలు.... 3.50
ఆంధ్రలోఅత్తలు... 3.50
పన్నీటి జల్లు ...... 3.00
సుమంగళి ... 1.50
మల్లెపూలు-మువిగాలన్ 5.00
మనసే నయ్యసూపారం 3.00
రోమన్ హాలిడే ... 3.50
సుక్రాంకరాణి రామస్వామి 1.25






ఒళ్లునొప్పి, జలుబులు, తలనొప్పి, బెణుకులు—వీటిని చప్పున చల్లగా తగ్గించుకోండి. బాధగా ఉన్నచోటు మీద అమృతాంజనం రాయండి. వెంటనే గుణం ఇస్తుంది. 75 సంవత్సరాల పైగా ఇంటింటి దీపమై వెలుగుతోంది అమృతాంజనం! ఎప్పుడూ ఒక సీసా దగ్గర ఉంచుకోండి. అమృతాంజనం ఆదాచేసే పెద్ద సీసాలలోనూ, చిన్న డబ్బాలలోనూ కూడా దొరుకుతోంది. అమృతాంజనం 10 ఔషధాలు కలిసినది. నొప్పులను, జలుబులను చప్పున చల్లగా తగ్గిస్తుంది.
అమృతాంజన్ లిమిటెడ్




AM-7902

అమృతాంజనం
చప్పున పోగొడుతుంది!

దేంటి? అక్కడికే వెళ్ళు. ఇదిగో, దారి ఖర్చుకు ఇది పట్టుకెళ్ళు" అని రెండు అయిదురూపాయల నోట్లు అందించాడు.

కొడుకు ప్రవర్తనకు నల్లమ్మ చలనం లేని బొమ్మే అయింది. చేతిలో ఉంచిన నోట్లు గాలికి ఎగిరి కింద పడ్డాయి. నల్లమ్మ తేరుకునేలోగానే కొడుకూ, కోడలూ లోనికి వెళ్ళి తలుపులు మూశారు.

ఆ స్థితిలో నల్లమ్మ చేసేది లేక కింద పడిన నోట్లను అందుకుని భారంగా పుట్టినింటికేసి అడుగులు వేసింది.

ఎప్పటిలా ముందు తమ్ముడి ఇంటికే వెళ్ళింది. జరిగిన గాథనంతా తమ్ముడికి చెప్పింది. తమ్ముడు జాలి పడలేదు. కోపంగానే అన్నాడు,

"అప్పుడు నే నేదో అంటే 'నా సవతికొడుకును విడిచి ఉండలేను, నా నెత్తిన రాయి పెడతాడు' అన్నావు. మంచి పని చేశాడు. ఇక్కడ ఏం దాచి పెట్టావని వచ్చావు? నా పెళ్ళాన్ని, పిల్లల్ని పెంచలేక ఏడుస్తున్నాను. నిన్ను కూడా ఎక్కడ భరించగలను? నువ్వు నా ఇంటి దగ్గర ఉండటం కుదరదు. చెల్లెలికి గేదెను తోలిపెట్టావు గదా? అక్కడికే వెళ్ళు" అని దెప్పి పొడిచాడు.

'నక్క నూతిలో పడితే నలుగురూ నాలుగురాళ్ళు రువ్వినట్లు నా బ్రతుకిలా గైంది' అంటూ బాధపడింది నల్లమ్మ.

మరువాడే చెల్లెలి ఇంటికి ప్రయాణమైంది. వెళ్ళేటప్పుడు కొద్దిగా చిల్లర ఉంటే తమ్ముడి పిల్లల చేతిలో పెట్టి కళ్ళనీరు నింపుకుంది.

అక్క ఇల్లు సవతికొడుక్కి వ్రాసిందన్న వార్త అప్పటికప్పుడే సేకరించింది చెల్లెలు. అప్పట్నుంచి అక్కమీద కారాలు మిరియాలు నూరుతూనే ఉంది.

వాకిలిలో నిలిచిన అక్కను చూసింది చెల్లెలు.

"చాలా కాలానికి గాలిలా విసిరింది." నెప్పిగా నలుగుతూ చెంబుతో నీళ్ళు తెచ్చి ఇచ్చింది అక్కగారికి.

నల్లమ్మ గుమ్మంలో అడుగు పెట్టిందో లేదో అప్పుడే ప్రారంభించింది చెల్లెలు. "ఇల్లు వాడికి వ్రాసి ఇచ్చావట. వాడు నిన్ను తిన్నగా చూస్తాడనుకున్నావంటే" అంటూ ఏమేమో ఎత్తి పొడిచింది.

"అందరూ నాలాంటి మనుషులే అని నమ్మాను. వాడి మాయమాటలకు మోసపోయి ఇల్లు వాడి చేతి కిచ్చాను. ఇప్పు డింట్లోనుంచి తరిమివేశాడు." చెల్లెలికి సంగతిని వివరించింది నల్లమ్మ.

"ఉన్నది అమ్ముకుని మా ఇంటికి రావే, మాతోనే ఉందువుగాని మొర్రో అని మొత్తుకుంటే నామాట విన్నావుటే? ఇప్పుడంతా తగలేసి వస్తే ఎవడు చూస్తాడనుకున్నావు" అంటూ అక్కమీద కయిబొయిలాడింది చెల్లెలు.

చెల్లెలు ఎన్ని మాట లన్నా నడుము విరిగిన పాములా మిన్నకుండా ఉంది నల్లమ్మ.

విసుక్కుంటూ, కసురుకుంటూ ముష్టిదానిలా కాస్త అన్నం అక్కగారికి పెట్టేది చెల్లెలు.

ఆ సరీసరిపోని మెతుకులు గుడ్లనీరు గుక్కుకుని తినేది నల్లమ్మ.

తిండిలోపంవల్ల, దిగులు వల్ల వారం తిరిగేసరికి మంచం పట్టింది నల్లమ్మ. అన్నీ మంచంమీదనే. చాకిరీ చేయలేక అస్తమానూ అక్కను తిట్టిపోసేది చెల్లెలు.

"ఆస్తంతా ఇచ్చినవాణ్ణి వదిలేసి శనిలా మా ఇంటికొచ్చి పడ్డావు. నీకు చాకిరీ చేయలేక ఛస్తున్నా. వాడు పొమ్మంటే ఇక్కడికి రాకపోతే, దారిలో గోదారిలో పడి చావలేకపోయావూ" అనేది మాటమాటకి.

"నేను పచ్చగా ఉన్నప్పుడు అందరూ తిన్నారు. ఇప్పు డేమీ లేదనే కదా అందరూ ఆడిపోస్తున్నారు? అందుకే అన్నారు పెద్దలు—'చచ్చేకాలం నాటికి సంపాదించిన డబ్బన్నా ఉండాలి, కన్న కొడుకైనా ఉండాలి' అని. తోడబుట్టినదానికే జాలి లేనప్పు డింకెవళ్ళ కుంటుంది? ఈ రోగం కుదిరి కాస్త సత్తువ రానియ్యవే. నీ ఇంట్లో ఉండనులే. పోతాను." బాధగా మూలిగేది నల్లమ్మ.

నల్లమ్మ ఒంట్లో కాస్త స్వస్థత చేకూరింది. ఇక ఆ ఇంట్లో ఓ క్షణం కూడా ఉండటానికి మనసొప్పలేదు. "చెల్లీ! నే వెళ్ళిపోతాను. గేదెబాపతు సొమ్మేమైనా ఇవ్వండి" అని అడిగింది.

అది విని కస్సుమంది చెల్లెలు. "తోడబుట్టినదాన్ని అమాత్రం నోచుకోలేదంటే? నీ రోగానికి బోలెడైంది. కుడిచెయ్యి, ఎడమచెయ్యి అనకుండా ఎత్తిపోశాను. నీ కామాత్రం విశ్వాసం లేదు" అంది.

"కోప్పడకే, అమ్మా! చేతిలో బొత్తిగా చిల్లిగవ్వ లేదు. మీకు తోచింది ఇవ్వండి." శాంతంగానే అడిగింది.



పెరుగుదల

ఫోటో—డి. జనార్దన్‌రాజు (మహబూబ్‌నగర్)

"ఇదిగో, ఈ ఆరు రూపాయలు ఉన్నాయి. పట్టుకెళ్ళు" అని ఇచ్చిందే గాని, "నీరసంగా ఉన్నావు. ఇప్పు డెక్కడికి వెళతావు?" అని మాటమాత్రమైనా అనలేదు.

మౌనంగా చేయి చాచింది. చెల్లెలి ముఖంలోని కోక్షణం నిదానంగా చూచింది. పొంగివచ్చే దుఃఖాన్ని మింగుకుని అడుగులు ముందుకు వేసింది మెల్లగా.

మిఠాయిదుకాణం ముందు ఆగి తనకు నచ్చిన మిఠాయిలు పొట్లాలు కట్టించుకుంది. కూర్చుంటూ, లేస్తూ ఏటి ఒడ్డుకు చేరుకుంది. అప్పటి కింకా ఎండ బాగా ఉంది.

అసలే జబ్బు పడి ఉన్న నల్లమ్మ నడవటంచే బాగా అలిసిపోయింది. ఏటిఒడ్డునే ఉన్న చెట్టునీడను కూలబడిపోయింది.

తెచ్చుకున్న పొట్లాలు ఒక్కొక్కటే విప్పుక్కుని తృప్తిగా తింది.

ఆ సమయంలో ఆమె తలలో అనేక ఆలోచనలు సుడులు తిరిగాయి. 'నే నింకా బ్రతికి సాధించే దేముంది? ఈ స్థితిలో నా బ్రతుకు భూమికే భారం' అనుకుంది.

సూర్యుడు అస్తమయాద్రిలో దాగాడు. చుట్టూ చీకట్లు అలముకుంటున్నాయి.

నల్లమ్మ గుండె దిటవు చేసుకుంది. మెల్లగా లేచింది. పిడికిళ్ళు బిగించింది. కళ్ళు మూసుకుని గంగలో దూకింది.

నీటిలో మునిగి ఊపిరాడక గిలగిల కొట్టుకుంది నల్లమ్మ ప్రాణం. గాలి చొరరాని దేహంలో ఇక నిలవలేక ఎగిరి వచ్చి చెట్టుపైన కూర్చుంది లోన ఉన్న ప్రాణం.

• • •

తన బలవంతపు చావును తలుచుకుని విలపించిందా ప్రాణి. నీరు నిండిన కళ్ళతో మళ్ళీ తన శరీరం కేసి చూచింది.

జాలరి దగ్గరకు చేరాడు. ఆశతో శవాన్నంతా వెదికి చూశాడు.

"ఛీ! దరిద్రపుగొట్టు శవం. ఒంటి మీద చిన్నమెత్తు బంగారం లేదు" అని చీదరించుకుని తెడ్డుతో ఓ పోటు పొడిచాడు. ఆ పోటుకు పక్కనున్న ఇసుకతిన్నెను తాకింది శవం.

అలాంటి అవకాశం కోసమే చూస్తున్న రాబందులు ఒక్కుమ్మడిగా వచ్చి శవం మీద వాలాయి.

ఇక ఆ దృశ్యాన్ని చూడలేకపోయిందా ప్రాణి.

"భగవంతుడా! పగవారికికూడా ఇలాటి దిక్కులేని చావు రాసి పెట్టకు, తండ్రీ!" అని మొక్కులిడి ఎక్కడికో ఎగిరిపోయిందా దిక్కు లేని ప్రాణి. ★